ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 20-01-2026 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"లో రోల్ మోడల్ గా నిలిచిన తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు.

2. దేశంలో ఆర్థిక , సామాజిక అంశాలను తప్పుదోవ పట్టించి కార్పొరేట్ శక్తులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఛాలెంజ్ విసురుతున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

3. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా యాప్ ను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ ప్రత్యేకంగా అభినందించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

4. సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల రద్దు వ్యవహారం కాంగ్రెస్ పార్టీ కమీషన్లు, కాంట్రాక్టుల పాలనకు నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శించారు.

**శ్రీధర్ బాబు**

"ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచిన తెలంగాణలో పెట్టుబడులు పెట్టా లని దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. స్విడ్జర్లాండ్ లోని దావోస్ లో ఈరోజు ప్రపంచ ఆర్థిక వేదక వార్షిక సదస్సులో ఏర్పాటు చేసిన ఇండియా పెవిలియన్ ప్రారంభోత్సవంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... భవిష్యత్తు ను నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని.... అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికా బద్ధమైన అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేశామన్నారు. దావోస్ వేదికగా తమ ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను సమీకరించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ప్రయత్నాలు చేస్తామన్నారు.

జీఎస్

**భట్టి విక్రమార్క**

దేశంలో ఆర్థిక , సామాజిక అంశాలను తప్పుదోవ పట్టించి కార్పొరేట్ శక్తులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఛాలెంజ్ విసురుతున్నాయని ఉప ముఖ్యమంత్రి

భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు ఖమ్మంలో సిపిఐ శత వసంతాల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ఆయన ప్రసంగించారు. కార్పొరేట్ శక్తులను ఐక్య పోరాటాల ద్వారా అడ్డుకుం దామని వామపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. 100 సంవత్సరాల సిపిఐ చరిత్రలో ఎన్నో త్యాగాలు , ఆటుపోట్లు ఉన్నాయనీ అన్నారు.

PTC, KMM

**మంత్రి తుమ్మల**

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా యాప్ ను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ అభినందించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈరోజు సచివాలయంలో పలు శాఖల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న యాంత్రీకరణ , ప్రకృతి వ్యవసాయం, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని , ఇంకా 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు . గత ప్రభుత్వం పట్టించుకోని కేంద్ర ప్రాయోజిత పథకాలను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరుద్ధరిస్తోందని, అందులో భాగంగా ఈ సంవత్సరం వివిధ పథకాల క్రింద ఇప్పటికే 500 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు.

జీఎస్

**ఉత్తమ్ - నల్లగొండ జిల్లా**

మహిళలు, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా , నేరేడుచర్ల లో ఈరోజు 404 స్వయం సహాయక మహిళా సంఘాలకు 52 లక్షల రూపాయల పైచిలుకు వడ్డీ లేని రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేసి, ఇందిరా మహిళా శక్తి పథకం కింద 5 వేల 498 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో జాతీయ రహదారులు మంజూరు చేయించానని , హుజూర్ నగర్ లో జూనియర్, డిగ్రీ కళాశాలల భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు.

పిటిసి, నల్గొండ

**సీతక్క**

గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ లు పని చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కామారెడ్డి లో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీలు ప్రజాస్వామ్యానికి పునాదులన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందన్నారు.

పిటిసి, కామారెడ్డి

**వివేక్ వెంకటస్వామి - బైట్**

మంచిర్యాల జిల్లా, మందమర్రిలో అమృత్ పథకం కింద 30 కోట్ల మంజూరు అయ్యాయని, వచ్చే ఆరు నెలల్లో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ వస్తుందని రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా, చెన్నూరు, మందమర్రిలో ఈరోజు పర్యటించిన మంత్రి మాట్లాడుతూ...

సౌండ్ బైట్ ... మంత్రి వివేక్ వెంకటస్వామి..

పీటీసీ, మంచిర్యాల

**దామోదర**

సంగారెడ్డి జిల్లా, జోగిపేట, ఆందోల్ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు సొంత భవనాల నిర్మాణానికి 4 కోట్ల రూపాయలను మంజూరు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఈరోజు 327 మహిళా సంఘాల కు వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహిళా సంఘాల పాత్ర కీలకమన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆందోల్‌లో ఐదు ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.

పిటిసి, సంగారెడ్డి

**యాదగిరిగుట్ట- మంత్రి కోమటిరెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఈ ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి లడ్డు ప్రసాదాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి అందజేశారు.

(పీటీసీ, యాదాద్రి భువనగిరి)

**రాం చందర్ రావు**

సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల రద్దు వ్యవహారం కాంగ్రెస్ పార్టీ కమీషన్లు, కాంట్రాక్టుల పాలనకు నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శించారు. ఈరోజు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అభివృద్ధి కోసం కాకుండా కేవలం కమీషన్ల కోసమే టెండర్లు పిలుస్తున్నట్లు నైనీ బొగ్గు బ్లాక్ అంశం ద్వారా బట్టబయలు అయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల సమస్యల గురించి కాకుండా కమీషన్ల గురించే ఆలోచన ఉందన్నారు. సింగరేణిలో జరిగిన కుంభకోణాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలకు చెరి సగం వాటా ఉందన్నారు. దేశంలోనే అత్యధిక లాభాల్లో ఉన్న సింగరేణిని ఈ రెండు పార్టీలు ఇప్పుడు నష్టాల్లో కూరుకుపోయేలా చేశాయని విమర్శించారు. నైనీ బొగ్గు బ్లాకులో జరుగుతున్న అక్రమాలకు ఈ రెండు పార్టీలు బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

జీఎస్

**నితిస్ నబిస్**

భారతీయ జనతా పార్టీ కార్యనిర్వాహక  అధ్యక్షుడిగా వ్యవహరిస్తోన్న నితిన్ నబిన్ పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. పార్టీ జాతీయ రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె. లక్ష్మణ్ ఈరోజు న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సంఘటన్ పర్వ్ కార్యక్రమంలో నబిన్‌ను పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించి,  ఆయనకు ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన నితిన్ నబిన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

న్యూస్ ఆర్ ఎయిర్

**బిజెపి సంబురాలు**

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించ డంతో హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సంబురాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు , కార్యకర్తలు టపాసులు పేల్చి , స్వీట్లు పంచుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.  ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

జీఎస్

**మేడారం జాతర ఏర్పాట్లు**

మేడారం మహా జాతర సమీపిస్తున్నందున అన్ని పనులను నిర్ణీత సమయంలో పూర్తి చే యాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.  మేడారంలో ఈరోజు నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ

మేడారం జాతరకు వచ్చే భక్తుల భద్రతపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

పిటిసి, ములుగు

**స్నేహిత అవేర్నెస్ ప్రోగ్రాం – బైట్**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో మహాత్మా గాంధీ జ్యోతి బా పూలే బాలుర పాఠశాలలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. ఇది బాలికల భద్రతకు భరోసా ఇస్తుందని హుజురాబాద్ సెక్టార్ సిడిపిఓ సుగుణ తెలిపారు.

బైట్ .. సుగుణ ... సిడిపిఓ, హుజరాబాద్

పిటిసి, కరీంనగర్

<u>హైడ్రా</u>

పర్యావరణ హితమైన నగరం తమ అభిమతమని హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ – హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఇందుకు గాను చెరువులు.. వాటిని అనుసంధానం చేసే వరద కాలువలను పరిరక్షిస్తున్నామని తెలిపారు. హైడ్రా అంటే ఆక్రమణల తొలగింపు సంస్థ మాత్రమే కాదని.. ప్రజా ఆస్తుల పరిరక్షణ , పర్యావరణ సంరక్షణ , విపత్తు నిర్వహణ, పట్టణ భద్రత అనే విస్తృత లక్ష్యాలున్నాయన్నారు. ఆసియాలో సాంకేతికత, నైపుణ్యం, పరివర్తన అనే అంశంపై నిన్న రాత్రి హైదరాబాద్ లో స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం- 2026 నిర్వహించిన సమావేశంలో ఐటీ , విద్యా సంస్థలతో పాటు.. పలు రంగాలకు చెందిన ప్రతినిధులకు హైడ్రా కార్యకలాపాలను కమిషనర్ రంగనాథ్ వివరించారు. మెరుగైన, ఆరోగ్యకర జీవనాన్ని సాగించాలంటే పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేయాలని స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం పేర్కొంది. ఈ

దిశగా హైడ్రా చేస్తున్న కృషిని అభినందించింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ హరిచందన కూడా పాల్గొన్నారు.

(డెస్క్)

<u>**నాగోబా-జూపల్లి**</u>

ఆదిలాబాద్ జిల్లా , ఇంద్రవెల్లి కేస్లాపూర్ లోని నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని  జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిన్న రాత్రి ఎమ్మెల్యే వెడమ బొజ్జు కలిసి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మెస్రం పెద్దలతో మాట్లాడి నాగోబా విశిష్టత గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

(పిటిసి నిర్మల్ జిల్లా)

<u>**ఆసిఫాబాద్**</u>

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవంఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ , కాగజ్ నగర్ పట్టణాలతో పాటు కౌటాల , బెజ్జూర్, సిర్పూర్(టి), పెంచికలపేట, దహెగం మండల కేంద్రాలలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలల్లో ఉదయం వాసవి మాతకు పంచామృతాలతో అభిషేకం చేసి , వాసవి మాత పారాయణం , కుంకుమ పూజలు , హోమాలు నిర్వహించారు. కాగజ్ నగర్ పట్టణంలో అమ్మవారి చిత్రపటాలకు హారతులు ఇస్తూ ఊరేగించారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)